


*(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)*

99

(8 ' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**దేశంలో** సినిమా ప్రేక్షక సంఘాలు చాలా వెలిసినాయి. సినిమా ఈనాటికి ఒక చక్కని వినోద కాలక్షేపంగా మారింది. ప్రేక్షకుల సంఖ్య పెరుగుతున్నది క్రమక్రమంగా. వెండితెర మీద అభిమానం పెరుగుతోంది మెల్లమెల్లగా.

అనేక చిత్రాలు శతదినోత్సవాలు జరుపుకుంటున్నాయి. ఇదంతా ప్రేక్షకుల అభిమానం వల్లనేనని అందరూ ప్రశంసించడం వింటున్నాం.

ఈ కాల పరిణామాన్నిబట్టి కొందరికి సినిమా అవసరమైన కాలక్షేపంగా మారింది. సినిమ వ్యామోహం అనే స్థితినుంచి 'అవసరం' అనే భావాన్ని కల్పిస్తున్నాయి ఈనాటి కల్లోల పరిస్థితులు. అంతులేని ధరలు, ధర్మనిగ్రహత లేనివారి సాంగత్యాలు వగైరాలు.

ఈ అస్తవ్యస్త స్థితుల్లో చిక్కుకొని ఈ వినోదానికి కారణభూతులైన తారాగణాన్ని ఒక్కసారి చూడాలి అనుకోనివాళ్ళు చాలా అరుదు. "ఎలా చూడడం?" అనే దిగులు ఏర్పడుతుంది అందరిలో.

ఒకసారి ఒక శతదినోత్సవ సభకు వచ్చిన ఆహ్వానాన్ని మరో సినిమా అభిమానికి యిచ్చాను వంట్లో బాగుండక పోవడం వల్ల. ఆయన ఎంతో సంతోషంతో తీసుకువెళ్ళాడు.

మర్నాడు పదిహేను రూపాయలు పెట్టి ఒక ఖద్దరు శాలువా తెచ్చి నాకు కప్పాడు. "ఇదేంటండి నాకెందుకు?" అంటే ఆయన ఉద్రిక్తకంటంతో ఇలా అన్నాడు. "మీరు చేసిన మహాత్యాగానికి ఇది ఒక లెక్కా? ఈ కాలంలో శతజయంత్యుత్సవ ఆహ్వానపత్రం అలా అడగ్గానే ఇచ్చేసే వదాన్యులు, విశాల హృదయులు ఎవరుంటారు? అక్కడ ఆ కళాకారులకు సన్మానాలు జరిపి శాలువలు కప్పుతుంటే ఆ అద్భుత దృశ్యాన్ని చూసి ఆనందించే భాగ్యం కల్పించిన మీరే నాకు పదే పదే జ్ఞాపకం వచ్చారు. అలాంటి అపూర్వానుభవాన్ని ఆయాచితంగా నాకు ప్రసాదించిన త్యాగమూర్తులు మీరు. నా యీ చిన్న కానుక స్వీకరించండి. లేకపోతే నేనెంతో బాధపడతాను" అంటూ అతడు మాట్లాడాడు.

"ఆహ్వానాన్ని శాలువకు అమ్ముకున్నామా?" అన్నాను ఎంతో విసుగ్గా.

"అమ్ముకోవడం కాదండీ నా అభిమానాన్ని మీరు అర్థం చేసుకోవడంలేదు. ఆ తారలను చూడాలనే ఆపేక్ష నాకెంతో వుంది. కానీ అలాంటి అవకాశం నాకింతవరకు రాలేదు. మీ మూలంగా లభించింది. ఆ ఆనందాన్ని ప్రకటించుకునేందుకే శాలువా తెచ్చాను" అన్నాడాయన.

నేను వ్రాసిన ఒక చిత్రం శతదినోత్సవం జరిగింది. నేనూ ఆ సభలో పాల్గొని ఆనందించాను. బహుమతి అందుకున్నాను. కానీ ఆ ప్రేక్షకులు ప్రదర్శించే బులబాటం తలిస్తే ఆనాడు నేను పొందిన ఆనందాన్ని మించి వుంది.

ప్రేక్షక లోకానికి ఉండే ఉత్సాహం ఆనందం వర్ణించడానికి వీలులేదు. ఈ దృష్టితో ఆలోచిస్తే అది ఫిలిం లోకానికి చెందినవారు చేసుకున్న అదృష్టమనిపిస్తుంది. లేకపోతే అశేష ప్రజానీకం వారిని చూడాలని అలా తాపత్రయపడడం, తన్మయం చెందడం దేనికి?

ప్రజాహృదయాలలో వారికి అంతస్థానం వుంది గనుకనే వారిని ఎన్నిసార్లు చూసినా ఇంకా చూడాలనిపించడం చూసి ఎంతో సంతృప్తి చెందడం జరుగుతోంది.

దేశంలో పరిస్థితులు తారుమారకగా వున్నాయి. ప్రజాజీవనంలో తందరబిందరేగానీ స్థిమితం కనిపించడంలేదు. ఇంత అశాంతిలో కొంచెం మనశ్శాంతి కలిపించుకోవాలంటే ఫిలిముల దృష్ట్యానే కొంచెం ఏర్పడుతుందేమోననిపిస్తుంది.

"తప్పో - ఒప్పో, మంచో చెడ్డో, నీతో, అవినీతో మూడు గంటలకాలం ముచ్చటగా గడిపి చక్కా వస్తున్నాం. వాటిల్లో వున్న దోషాలను గురించి విచారించవలసిందీ, విచారపడవలసిందీ మనం కాదు. పైనున్నారుగా పెద్దలు" అన్నాడొకాయన.

"వరుసగా పాతికేళ్ళు పురాణానికెళ్ళాను. అక్కడ చెప్పిన ధర్మాలన్నీ విన్నాను. మనస్సుకు పట్టించుకున్నాను. సంసారాల్లో పురుషుడెలా ఉండాలో, స్త్రీలెలా ఉండాలో అన్నీ గ్రహించుకున్నాను."

"అవన్నీ సంతానానికి బోధించి అలా తయారుచేయాలనుకున్నాను. కానీ ఎవరు వింటున్నారు? పాతకాలపు మాట బూతును మించిపోయింది. సీతమ్మలాగా, అనసూయలాగా, అరుంధతిలాగా వుండాలని కోరేవారెవరున్నారీకాలంలో? అరుంధతి పేరు ఎప్పుడయినా మా ఆడపిల్లల దగ్గిర ఎత్తితే 'నీ రంధి నువ్వు మానవు' అని విసుక్కుంటున్నారు. "

మగపిల్లలు మాత్రం తక్కువా! వాళ్ళెన్నో నీతులు నేర్చారు. వాళ్ళకు ఇంటికి రావడమే కష్టంగా వుంది. ఎవరెలా వున్నా కాలూ, చెయ్యీ వున్నంతవరకూ కన్నసంతానాన్నికింత సేవ చేసుకోవాలనిపిస్తోంది గదా! మొగపిల్లలు ఇంటికి వచ్చినప్పటి నుంచీ పడితే యోగాభ్యాసం లేకపోతే పిచ్చి రాగాలాపన.

"ఏవో పాటలు.. మధ్యమధ్యలో ఈలలు. బల్లలు బ్రద్దలు కొట్టడం ఆ గొట్టం లాగూలలో పీట మీద కూర్చోలేక కంచం చేత్తో పట్టుకుని నాలుగు ముద్దలు తినడం, కూర బాగుండలేదనడం, చారు దొడ్లో పారబొయ్యమనడం - చల్లవంక చూసి కళ్ళు మూసుకుని ఎడం చెయ్యి అడ్డం పెట్టడం, ఆ కంచాన్ని విష్ణుచక్రంలా గిరాటు వేసిపోవడం నిత్యకృత్యమైపోయింది. "

"అమ్మా! అని స్థితి అన్నమడుగని నోరున్.." అన్నాడు సుమతీ శతక కర్త. ఆ శతకంలో పద్యాలు చాలా మార్చివేయాలీ రోజుల్లో. బాబూ అన్నం పెట్టరా! అమ్మాయి అన్నం పెట్టవే అని అరవలేక నాలుక అరవ అప్పడం కన్నా సన్నపడిపోయింది.

ఇలాంటి కాలంలో పాతకాలపు ఆశలు పెట్టుకుని ఏం లాభం? అజంతా బొమ్మలాగా వంటింటి గోడకు అతుక్కుపోయి ఏం లాభం? అందుకని నేనూ రెండురోజులకోసారి సినిమాకు పోతున్నా. ఒక మూడు గంటల కాలక్షేపం.

"ఎలాంటి సినిమా అన్నా కొంత బాగుంటుంది కదా! రెండు పాటలైనా బాగుంటాయి కదా. ఏ కథ అయినా ఇంట్లో కథంత గందరగోళంగా ఉండదు కదా?" అని ఒక ముసలమ్మ తన వ్యధను ఆత్మకథలో ఒక అధ్యాయంలాగా వర్ణించింది.

ఈ దృష్టిలో ఆలోచిస్తే ఫిలిం ప్రేక్షకుల అభిమానాలు అసహజంగా కనిపించవు. గృహిణులుకూడా చాలామంది సినిమా డబ్బులిలా చేతిలో పడేసి తర్వాత మీ చిలిపితనం చూపించండి అంటున్నారు భర్తలను.

ఏ విధంగా ఆలోచించినా ఈ కాలంలో ఫిలిములు కొంత కాలక్షేపంగా వినియోగపడుతున్నాయి. కల్లోలంలోనుంచి చల్లటి నీడకు వెడుతున్నట్లు భావిస్తున్నారు ప్రజలు. అలాంటి శాంతిని ప్రసాదించే నటీనటులంటే అభిమానం ఎక్కువ కావడంలో ఆశ్చర్యం ఏం వుంటుంది?

సినిమా పాటలు విన్నా, నటీనటుల్ని చూసినా పకపకలాడటం, ఉత్సాహం ప్రకటించడం చూస్తున్నాం.

నటీనటులు - వారికి తీరిక వుండకపోవచ్చు. ఇలాంటి సన్మాన సందర్భాల్లోనే కాకుండా అప్పుడప్పుడు దేశంలో సంచారం చేయడం మొన్న శ్రీరామారావుగారు చెప్పినట్లు ప్రజాసేవలో పాల్గొనడం మంచిదనిపిస్తుంది.

పైన చెప్పిన సన్మాన సందర్భాలలో ప్రజలు పొందిన ఆనందాన్ని, వారు వెలిబుచ్చిన భావాల్నీ ఈసారి వ్రాస్తాను.

Post your comments